క్లుప్తంగా

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: విత్తన దుకాణాల యజమానులు నాసిరకం విత్తనాలను, బిల్లులు లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు చేపడతామని మండల వ్యవసాయాధికారి ఈఓ రంగనేతాజి తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీలక్ష్మీవెంకటసాయి, శ్రీవీరభద్రస్వామి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తన నిల్వలు, వాటికి సంబంధించిన రిజిష్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. దుకాణాల యజమానులు తప్పకుండా స్టాకు బోర్డుపై ప్రదర్శించాలని చెప్పారు.

పశువులకు గొంతు వాపు టీకాలు వేయించండి



రుద్రవరంలో పశువుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

రుద్రవరం: పశువులకు వెంటనే గొంతు వాపు టీకాలు వేయించాలని ఎర్రగుడిదిన్నె పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం గొంతు వాపు టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కురుస్తున్న తొలకరి వర్షాలకు కొత్తగా గడ్డి మొలకలు వస్తున్నాయని, వాటిని తిన్న పశువులకు వెంటనే గొంతు వాపు వ్యాధి సోకుతోందన్నారు. ఆ వ్యాధి సోకిన కొన్ని గంటల్లోనే పశువు మృతి చెందే ప్రమాదముందని, పశువులు మృత్యువాత పడకుండా ఉండేదుకు ప్రతి రైతు తమ పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకా వేయించాలని చెప్పారు. ఇప్పటికే 400 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.

నేటి నుంచి గోకారమయ్య ఉరుసు

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామంలో వెలసిన హజరత్ గోకారమయ్య స్వామి ఉరుసు బుధవారం నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 22న గంధోత్సవంతో పాటు ఖవ్వాళి, 23న ఉరుసు, 24న స్వామి జెండా ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

బనగానపల్లె రూరల్ : జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని ట్రైనీ డీఎస్పీ రఘువీర్ సూచించారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్లు వెంట సీఐలు గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డితో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల పై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల్లో గెలిచినవారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బాణా సంచాలు పేల్చేడానికి పోలీసులు అనుమతి లేదన్నారు. ఎవరైన శాంతిభద్రతకుల విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీరు వెళ్లే మార్గం లేక..



ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచి వున్న వర్షపు నీరు

ఉయ్యాలవాడ : చిన్న పాటి వర్షం కురిసినా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ మడుగుగా దర్శనమిస్తుంది. నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక నిల్వ ఉండిపోతుంది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరి నిలిచిపోయింది. పాఠశాల పునః ప్రారంభం అయ్యేలోగా వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు: ప్రభుత్వం సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పూర్తిగా రసాయన ఎరువులు మీద ఆధారపడితే నేల సారం దెబ్బతింటుందని, వరికి ముందు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకోవాలని సూచించారు. 50 శాతం సబ్సిడీతో జీలుగు విత్తనాలు 100 క్వింటాళ్లు మండలంలోని అన్ని ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 10 కేజీల జీలుగలను 50 శాతం సబ్సిడీతో రూ.440కి ప్రభుత్వం అందిస్తుందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకెళ్లి ఆర్బీకేలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

వేసవి దుక్కులతో భూసారం

- దుక్కులతో భూమి లోపలి పొరలకు గాలి, సూర్యరశ్మి
- క్రిమికీటకాలు నాశనం
- భూమి వదులుగా మారి వర్షపు నీరు లోపలికి ఇంకుతుంది
- కలుపు సమస్యకు చెక్



మిట్నాల వద్ద ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతన్న

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ పంటలు వేయటానికి ముందు పొలాల్లో వేసవి దుక్కులు దున్నడం వల్ల రైతులకు ఎంతో లాభం ఉంటుంది. దుక్కులు లోతుగా దున్నటం వల్ల అధిక ప్రయోజనాలు పొందవచ్చు. నేల గుల్లగా మారి భూమిలో ఉన్న పురుగులు, బ్యాక్టీరియా బయటకు వచ్చి నాశనమవుతాయి. భూమి సారవంతంగా మారుతుంది. దీంతో పంటల దిగుబడి పెరిగి, సకాలంలో పంట చేతికొస్తుంది.

ఎప్పుడు చేయాలి..

పంట కోసిన తర్వాత తొలకరి వానలు కురిసే వరకు భూమి ఖాళీగా ఉంటుంది. రెండు నుంచి మూడు నెలల పాటు భూమి ఎండకు ఎండి గట్టి పడుతుంది. జూన్ నెలలో తొలకరి వానలు పడగానే రైతు తన పొలంలో ఏ పంట వేయాలో నిర్ణయించుకుంటాడు. వేయబోయే పంటను బట్టి ఎన్నిసార్లు భూమిని దున్నాలో నిర్ణయించుకుంటాడు. ఏటా ఒకే లోతుకు భూమిని దున్నటం వల్ల నల్లరేగడి భూముల్లో అడుగున గట్టి పొరలు ఏర్పడతాయి. ఈ పొరల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా చేయటమే కాకుండా మొక్క వేళ్ల లోనికి వెళ్లకుండా చేస్తాయి. దీంతో అవి గిడసబారి పోతాయి. ఇది పంట దిగుబడిపై అధిక ప్రభావం చూపుతుంది. వేసవి కాలంలో దుక్కులను లోతుగా దున్నటం వల్ల భూమి లోపల ఉండే క్రిమికీటకాలు భూ పైపొరల్లోకి వచ్చి ఎండ వేడిమికి చనిపోతాయి. ఎండాకాలం దుక్కి లోతుగా దున్నటం వల్ల వర్షాకాలంలో పడే వర్షాలకు భూమి గుల్లగా తయారై పంట వేయడానికి అనుకూలంగా మారుతుంది. అలా కాకుండా తొలకరిలో వర్షాలు పడిన తర్వాత దుక్కి దున్నితే పంటకు అనుకూలంగా ఉండదు. రైతులు ఏపంట సాగు చేయాలనుకున్నా వేసవి దుక్కులతోనే అధిక ప్రయోజనం చేకూరుతుంది. వీటి వదల్ల కొన్ని రకాల క్రిమికీటకాలు లార్వా, గుడ్డు దశలో నశిస్తాయి. ఈ దుక్కుల వల్ల రసాయన మందుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు.

లోతుగా దున్నుకోవాలి



రైతులు వేసవి దుక్కులు వేయటం వల్ల అనేక లాభాలున్నాయి. 6 నుంచి 7 అంగుళాల పైన నేల దున్నినట్లయితే భూమి మరింత సారవంతమవుతుంది. రైతులు చెరువుల్లోని మట్టిని పంట పొలాలకు వేసుకుంటే భూసారం పెరుగుతుంది.

– ప్రసాదరావు, వ్యవసాయాధికారి, నంద్యాల

ప్రయోజనాలు..

- మట్టి ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- వేసవి దుక్కుల వల్ల భూమి వదులుగా అవుతుంది. తద్వారా భూమిలోని క్రిమికీటకాలు పూర్తిగా చనిపోతాయి.
- వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. పంట వేసినప్పుడు మొక్క వేరు లోపలికి నీరు వెళ్లి బలంగా ఉంటాయి.
- చీడ పురుగులు నశిస్తాయి. తద్వారా పురుగు మందుల వాడకం తగ్గుతుంది. భూములు సారవంతంగా మారతాయి.
- అధిక వర్షాలు కురిసినా భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూమి పొరల్లోకి గాలి వెళ్లి మొక్కల వేరు వ్యవస్థ విస్తరించి మొక్కలు బలంగా ఉంటాయి.
- లోతు ఎక్కువగా దున్నటం వల్ల కలుపు గింజలు బయట పడతాయి. వాటిని పక్షులు తినటంతో కలుపు కూడా తగ్గుతుంది. కొన్ని రకాల కలుపు మొలక బయట పడి వేడికి చనిపోతాయి.
- అధిక వర్షాలు కురిసినా భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది.
- మొలక శాతం పెరుగుతుంది. సకాలంలో పంట వేసుకోవటానికి పొలం అనుకూలంగా మారుతుంది.
- సేంద్రియ, రసాయన ఎరువులు కలిపి దున్నినట్లుగా మారుతుంది.
- పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి మోడులు భూమిలో అడుగు భాగానికి చేరి కుళ్లి ఎరువుగా మారతాయి.
- అలాగే చెరువు మట్టిని వేసి పొలం దున్నటంతో భూసారం మరింత పెరుగుతుంది.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం



జిల్లెల్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గోస్పాడు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు నిషేధమని నంద్యాల తాలూకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం పోలీసుల కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో ప్రజలు కౌంటింగ్ కేంద్రాల వద్దకు రాకూడదని సూచించారు. కౌంటింగ్ అనంతరం గెలుపు, ఓటముల సందర్భంగా ఆయా పార్టీల అభిమానులు టపాసులు పేల్చడం, విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం, సమావేశాలు నిర్వహించరాదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐలు నాగార్జున రెడ్డి, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లి నాగేశ్వరరావుకు నివాళి

నంద్యాల(న్యూటౌన్): రైతాంగ కమ్యూనిస్టు ఉద్యమ నేత కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా సాయిబాబానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులు మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హక్కులు, సాగునీటి పారుదల ప్రాజెక్టుల సాధనకు కృషి చేశారని కొనియాడారు. కృష్ణ, మద్దిలేటి, బాషా పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్



గొడిగనూరులో ఇంట్లో సోదాలు చేస్తున్న సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ రమణయ్య

చాగలమర్రి: వచ్చే నెల 4వ తేదీన వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని గొడిగనూరు గ్రామంలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద ఇళ్లల్లో సోదాలు నిర్వహించి, సరైన రికార్డులు లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనవసరంగా ఎవరూ కౌంటింగ్ కేంద్రాల వద్దకు వెళ్లరాదని, అక్కడ 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. శిరివెళ్ల సీఐ చంద్రబాబునాయుడు, రుద్రవరం ఎస్ఐ నిరంజన్, ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ నరసింహుడు, 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన



శ్రీకాళికాంబకు అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ చేపట్టారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

ఫీజు కట్టకపోయినా పరీక్ష రాయవచ్చు



చాగలమర్రిలో మాట్లాడుతున్న ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా

దొర్నిపాడు: ఈనెల 24వ తేదీ నుంచి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజు కట్టకపోయినా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలు రాయవచ్చని ఎంఈఓ రామచంద్రయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ తరహాలో నూతన పాఠ్యపుస్తకాలు రానున్నాయి. దీంతో ఫెయిల్ అయిన విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షలు రాసే వెసులుబాటును అధికారులు కల్పించారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి వెంటనే తమ పిల్లలను పరీక్షలు రాసేలా చూడాలని కోరారు.

శిరివెళ్ల: ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరు కావాలని ఏంఈఓ నాగార్జునరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతు ఈ ఏడాది మార్చిలో ఫెయిలన విద్యార్థులతో పాటు గతేడాది ఫెయిలైన వారు కూడ పరీక్షలు రాయవచ్చాన్నారు. ఈ ఏడాదితో పాత సిలబస్‌తో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది కొత్త సిలబస్‌తో పరీక్షలు జరగనున్నాయని చెప్పారు.

చాగలమర్రి: ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కానీ విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు మినహాయింపుతో హాజరు కావచ్చని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ మండలంలో పది పరీక్షలకు 760 విద్యార్థులు హాజరు కాగా 612 మంది ఉత్తీర్ణులవగా, 148 మంది ఫెయిలయ్యారు. వారికి ప్రభుత్వం ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రభుత్వం ఫీజు చెల్లించకపోయినా రాసేందుకు అనుమతించింది. మండలానికి చెందిన విద్యార్థులకు ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



యర్రగుంట్లలో ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీపీఓ

శిరివెళ్ల: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీపీఓ మంజుల వాణి సూచించారు. మంగళవారం యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను పరిశీలించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును ఆరా తీశారు. రూ.7.80 లక్షలు వసూళ్లు కావాల్సి ఉండంగా 80 శాతం వసూళ్లయ్యాయన్నారు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంక్‌లు, ప్రైవేట్ మినరల్ ప్లాంట్లు, వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. మినరల్ వాటర్ ప్లాంట్లను 3 నెలలకు ఒక సారి తనిఖీ చేసి నీటి నాణ్యతను రికార్డు చేయాలని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు . గ్రీన్ అంబాసీడర్లను నియమించుకోవాలని చెప్పారు. ఈఓఆర్డీ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్, సర్పంచు అయ్యలూరి సుభహాన్ ఉన్నారు.

పాఠశాలలకు నోట్ పుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని 2,077 మంది విద్యార్థులకు 14,444 నోట్ పుస్తకాలు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నిల్వ చేసినట్లు చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించని వారు కూడా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావచ్చన్నారు.

సింహ వాహనంపై దర్శనమిచ్చిన పాండురంగడు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, గణపతి పూజ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పాండురంగడు సింహవాహనంపై దర్శన మివ్వడంతో భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించా రు. బుధవారం స్వామివారు శేషవాహనంపై దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



అర్చకులకు నగదు అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయాభివృద్ధికి దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. మంగళవారం నంద్యాల పట్టణం సాయిబాబా నగర్‌కు చెందిన లోకేష్ జనరల్ స్టోర్ యజమాని కొల్లి చందమౌళి, నాగలక్ష్మీ, నాగ భరత్‌కుమార్, లోకేష్ రూ. 1,00,116 అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామికి అందించారు. స్వామివారి దర్శనం అనంతరం దాతల కుటుంబ సభ్యులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యాహక్కు చట్టాన్ని ఉన్నతాధికారులు పకడ్బందీగా అమలు చేయాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కొమ్ముపాలెం శ్రీనివాస్ జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పాఠశాలల యాజమాన్యాలు ఫోన్ చేసి పిలిపించుకొని వారికి అడ్మిషన్లు ఇవ్వాలని కోరారు. విద్యార్థి తల్లిదండ్రులు అడిగిన కూడా సమాచారం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా నృసింహస్వామి జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం ఆలయ 26వ వార్షికోత్సవం, స్వాతిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని మేళతాళాలతో పల్లకీలో ఊరేగిస్తూ భక్తులతో 108 కలశాలచే చెరువు కట్ట నుంచి జలాన్ని తీసుకొచ్చి అభిషేకాలు చేసి, స్నపన తిరుమంజనసేవ, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి వార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. నిర్వాహకులు మధుసూదన్‌రాయలు మాట్లాడుతూ 22వ తేదీన ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే.. నృసింహ జయంతిని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సంజీవనగర్‌లో వెలసిన నృసింహస్వామికి పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేపట్టారు.


కమనీయం.. లక్ష్మీచెన్నకేశవుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మిడుతూరు: మండలకేంద్రంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో ఆశీనులు చేశారు. మేళతాళలతో భక్తజనుల గోవింద నామస్మరణ మధ్య కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు సోమవారం అర్ధరాత్రి నుంచి వరుడి అలంకరణలో స్వామివారిని పల్లకీలో పురవీధుల గుండా ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 5.20 నిమిషాలకు మేష లగ్నంలో కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. అనంతరం స్వామి అమ్మవార్లను ఉదయం శేషవాహనంపై, సాయంత్రం హనుమద్ వాహనంపై ఊరేగారు.

కలుషిత నీటితో అవస్థలు



గుంతనాల వాటర్ ట్యాంకు

నంద్యాల(అర్బన్): కలుషిత నీటిని తాగుతూ అవస్థలు పడుతున్నామని మండలంలోని గుంతనాల గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులకు కుందూ నది నుంచి పైపులైన్ ద్వారా నీటిని ఓహెచ్ఆర్ ట్యాంకులకు పంపి వాటి ద్వారా సరఫరా చేస్తున్నారు. మూడు మాసాలుగా కుందూ నది అడుగంటి పోవడంతో కలుషిత నీరు ట్యాంకులకు సరఫరా అవుతుందని, ఆ నీటిని తాగుతూ అనారోగ్యాలకు గురవుతున్నామని వారు వాపోయారు. విషయాన్ని పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అలాగే గ్రామంలో నున్న ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని, ఎప్పుడు కూలుతుందో తెలియక ఆందోళన చెందుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీరు అందేలా చూడాలని కోరారు.

ఆదిత్య పుష్పం

మహానంది: అందాలను ఆవిష్కరించడంలో ప్రకృతిని మించిన చిత్రకారులు లేరు. ఇక సూర్యోదయం, సూర్యాస్తమయం వేళలో ఆవిష్కృతమయ్యే అందాలు నిత్య నూతనం. మండలంలోని మసీదుపురం సమీపంలోని అస్తమిస్తున్న అరుణ వర్ణపు సూర్యుడు ఆకుల చివరన పుష్పంలా ఒదిగి పోయిన దృశ్యాన్ని మంగళవారం సాక్షి కెమెరాలో బంధించింది.



నేటి నుంచి హోమాలు



అవధూత శివరామస్వామి

నంద్యాల(అర్బన్): మండలంలోని మిటాన్నల గ్రామంలో వెలసిన అవధూత శివరామ స్వామి ఆలయంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు శ్రీపాద శ్రీవల్లభ జాతక గురుబల సిద్ధి వ్రతం, శ్రీదత్తాత్రేయస్వామి హోమాలు నిర్వహిస్తున్నట్లు శివరామ స్వామి భక్త మండలి సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, శ్రీలక్ష్మి గణపతి సహిత రుద్రహోమాలు ఉంటాయని, సాయంత్రం గ్రామ దేవతలకు నూతన పట్టువస్త్రాల సమర్పణ, ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. గురువారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం గోపూజ, దత్త హోమాలు, మధ్యాహ్నం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ చేపడతామని, సాయంత్రం దత్తాత్రేయ స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



రుద్రవరంలో సంగీత ప్రదర్శన నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాయీ బ్రాహ్మణులు సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ముందుగా త్యాగరాజ స్వామి చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు చేసిన అనంతరం సంగీత కచేరి చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు సంగీతాన్ని వాయిద్యాల ద్వారా తమ కళను ప్రదర్శించారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మాన్యం వేలం వాయిదా

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వర,ఆంజనేయ స్వామి ఆలయాల మాన్యం కౌలు వేలం వాయిదా వేసినట్లు ఈఓ సాయి జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల లెక్కింపు పూర్తయ్యే వరకు వేలం వాయిదా వేయాలని చెప్పడంతో బుధవారం నిర్వహించాల్సిన భాస్కర నందీశ్వర,ఆంజనేయ స్వామి వారి మాన్యం కౌలు వేలం వాయిదా వేస్తున్నామని, తిరిగి వేలం నిర్వహించే తేదీలను తెలి యజేస్తామని ఈఓ చెప్పారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారం ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం మెట్ల మార్గం ద్వారా భక్తులు కొండపైకి చేరుకుని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించి పూజలు చేశారు. కాశిరెడ్డినాయన అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.